సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 20 । ఆగస్టు । 2024



ముగిసిన పోరు

సాఫ్ట్‌బాల్ స్టేట్‌మీట్ ముగిసింది. ప్రభుత్వ సాయం లేకపోయినా అదుర్స్ అనిపించిన నిర్వాహకులు. - 8లో



నూతన విద్యార్థుల సందడి

ట్రిపుల్ ఐటీలో నూతన విద్యార్థుల సందడి కనిపిస్తోంది. కొత్తవాళ్లు చేరుతున్నారు. - 8లో



దేవీ పీఠంలో పౌర్ణమి పూజలు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కుంచాలకూర్మయ్యపేటలోని దేవీ పీఠంలో సోమవారం ఘనంగా పౌర్ణమి పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరీ దేవిని పూలతో అలంకరించారు. మహామేరువుకు ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

పారిశ్రామికీకరణతోనే ఆర్థిక ప్రగతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: పారిశ్రామిక అభివృద్ధితోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని అందుకోసం పటిష్ట ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డీఐఈపీసీ సభ్యులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ ప్రత్యేక సమావేశంలో సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడారు. నూతన పారిశ్రామిక విధానం 2024–2029 లో భాగంగా ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించామని, పరిశ్రమలే జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు అని ఆ దిశగా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలోకి తీసుకు రావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా పరిశ్రమలశాఖ, బ్యాంకు అధికారులు దృష్టి సారించాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ(ఐడీపీ)లను అనుసరించి జిల్లాలో అన్ని సెక్టార్లలో అభివృద్ధికి గల అవకాశాలను పరిశీలించాలని వివరించారు. జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ జె.ఉమామహేశ్వర రావు సంబంధిత వివరాలను సమావేశంలో కలెక్టర్‌కు వివరించారు.

బొత్సను కలిసిన తమ్మినేని



బొత్స సత్యనారాయణకు శుభాకాంక్షలు చెబుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ఇటీవల జరిగిన ఉమ్మడి విశాఖపట్నం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణతో పలు అంశాలు చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యువ నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 46 ఫిర్యాదులు

శ్రీకాకుళం క్రైమ్ : ప్రజా సమస్యలకు చట్టపరిధిలో పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి 46 వినతులు అందాయి. ముఖాముఖి ఫిర్యాదుదారులతో హాలులో మాట్లాడటమే కాకుండా బయట ఉన్న వృద్ధుల వద్దకు వచ్చి ఎస్పీ సమస్యలు తెలుసుకున్నారు. ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు గ్రీవెన్స్‌లో ఉన్న ఎస్పీ వద్దకు చేరి అంతా సోదరభావంతో మెలగాలనే ఉద్దేశంతో రక్షా బంధన్ తెలుపుతున్నామంటూ రాఖీ కట్టారు.

'మీ కోసం'కు 130 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో నమోదైన అర్జీదారుల సమస్యలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, ప్రత్యేక ఉపక్ కలెక్టర్ రామ్మోహనరావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ వారం మొత్తం 130 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో కేఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ సుదర్శనదొర, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.మీనాక్షి, డ్వామా పీడీ చిట్టి రాజు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఈ రాంబాబు, జిల్లా ఉద్యాన అధికారి ఆర్‌వీ ప్రసాద రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

జలుమూరు: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై కార్యకర్తలు నిర్లక్ష్యంగా ఉంటే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఆర్‌జేడీ చిన్మయదేవి అన్నారు. సోమవారం నగిరికటకం, మెట్టపేట కేంద్రాలు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వాస్తవంగా పిల్లలు ఎంత మంది కేంద్రాలకు వస్తున్నారు. ఎంత మందికి హాజరు వేస్తున్నారు అని అడిగారు. అలాగే పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా చేస్తున్నారా గుడ్లు, పప్పు తదితరవి నాణ్యమైనవి ఇస్తున్నారా లేదా అని అడిగారు. కేంద్రాల తనిఖీలకు సూపర్‌వైజర్ వస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. కేంద్రాల్లో పిల్లలు తక్కువగా ఉండడంపై ప్రశ్నించారు.

అచ్చెన్న X రవి





- సిక్కోలు టీడీపీలో ఆసక్తికరంగా పదవుల పోరు
- మంత్రి పదవి దక్కలేదన్న ఆవేదనలో కూన రవికుమార్
- పదవి దక్కకుండా అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు కుట్ర పన్నారనే అనుమానం
- అచ్చెన్నాయుడు నిర్వహించే సమావేశాలకు గైర్హాజరవుతున్న కూన
- తాజాగా గౌతు లచ్చన్న జయంతి వేడుకల్లోనూ అదే సీన్ రిపీట్
- కూన రవి తీరును లైట్‌గా తీసుకుంటున్న అచ్చెన్నాయుడు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : సిక్కోలు టీడీపీలో మంత్రి పదవి రేపిన చిచ్చు ఇంకా రగులుతూనే ఉంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మధ్య ఇప్పటికీ పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. తనకు రావాల్సిన మంత్రి పదవిని రాకుండా కింజరాపు అబ్బాయ్, బాబాయ్‌లు చేశారని కూన రవికుమార్ గట్టిగా నమ్ముతున్నారు. తనను రాజకీయంగా దెబ్బకొట్టిన వ్యక్తితో కలిసి వెళ్లడానికి రవికుమార్ ఇష్టపడడం లేదు. అచ్చెన్నాయుడుతో కలిసి వేదికను పంచుకోవడానికి ముఖం చాటేస్తున్నారు. అదే సమయంలో అచ్చెన్న కూడా కూన వైఖరిని అస్సలు పట్టించుకోవడం లేదు. ఆయన వస్తే ఏంటి? రాకపోతే ఏంటి? అన్నట్టుగానే వ్యవహరిస్తున్నారు. ఇప్పుడిది తెలుగు తమ్ముళ్లను అయోమయంలో పడేసింది. పైగా రెండు సామాజిక వర్గాల వివాదంగా కూడా మారిపోయింది.

చిచ్చు రేపిన మంత్రి పదవి

టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా కూన రవి జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఎన్నికల్లో గెలిచాక తప్పకుండా తనకు మంత్రి పదవి వస్తుందని భావించారు. కాళింగ సామాజిక వర్గ కోటాలో తప్పకుండా మంత్రి పదవి ఇస్తారని, ఆ పదవి తన కే దక్కుతుందని కేబినెట్ ప్రమాణ స్వీకారం ముందు రోజు రాత్రి వరకు ప్రచారం నడిచింది. కానీ చివరి నిమిషంలో కూన రవికుమార్‌కు అధిష్టానం మొండి చేయి చూపింది. దీనికంతటికీ అచ్చెన్నాయుడు, కింజరాపు రామ్మోహన్‌నాయుడు చేసిన కుట్రలే కారణమని ఆ సామాజిక వర్గంతో పాటు కూన రవికుమార్ నమ్ముతున్నారు. తనకు కేంద్ర మంత్రి పదవి ఇవ్వకపోయినా ఫర్వాలేదు గానీ బాబాయ్ అచ్చెన్నాయుడికి మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని చంద్రబాబు, లోకేష్ వద్ద రామ్మోహన్‌నాయుడు పట్టుపట్టడం వల్లనే చివరి నిమిషంలో కేబినెట్ బెర్త్ పోయిందని భావిస్తున్నారు. అప్పటి నుంచి ఆయన సైలెంట్ అయిపోయారు. ఆ తర్వాత కాళింగ సామాజిక వర్గం సీరియస్‌గా తీసుకోవడంతో కూన రవికి మద్దతు పెరిగింది. దీంతో ఎమ్మెల్యే గా ప్రమాణ స్వీకారం చేసి జిల్లాకు వచ్చినప్పుడు అచ్చెన్నాయుడుకు పోటీగా ఫ్లెక్సీలు, స్వాగత ఏర్పాట్లు చేసి తామేంటో, తమ బలమేంటో చూపించే ప్రయత్నం చేశారు.

వేదికనూ పంచుకోని వైనం

జరిగిన పరిణామాలను నిశితంగా గమనించిన కూన రవికుమార్ తనకు న్యాయం జరిగే వరకు అచ్చెన్నాయుడుతో కలిసి వెళ్లకూడదని నిర్ణయించుకున్నట్టు సమాచారం. మంత్రి హోదాలో అచ్చెన్నాయుడు తొలిసారిగా నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశానికి కూన గైర్హాజరయ్యారు. ఆ తర్వాత పలు పర్యాయాలు కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశాల్లో కూడా పాల్గొనలేదు. అచ్చెన్నాయుడు ఉంటే.. దరిదాపులకు కూడా వెళ్లడం లేదు. అచ్చెన్నాయుడు లేకుండా జరిగే సమావేశాలకు మాత్రం హాజరవుతున్నారు. అచ్చెన్నతోనే కాదు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు పాల్గొంటున్న సమావేశాలకూ వెళ్లడం లేదు. తాజాగా గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా డే అండ్ నైట్ జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమం వేదికపైకి రాకుండా కేవలం విగ్రహానికి పూలమాల వేసి వెళ్లిపోయారు. మిగతా ఎమ్మెల్యేలు కోరినా, ముఖ్యంగా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రత్యేకంగా మైక్‌లో పిలిచి ఆహ్వానించినా పట్టించుకోకుండా వెళ్లిపోయారు. గౌతు లచ్చన్న మనవరాలు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కారు దగ్గరికి వచ్చి ఆహ్వానం పలికినా తనకు పని ఉందని చెప్పి కూన రవికుమార్ వెళ్లిపోయారు. కనీసం అచ్చెన్నాయుడు ముఖం చూసేందుకు కూడా ఇష్టపడటం లేదని ఆ రోజు చోటు చేసుకున్న పరిణామాలతో స్పష్టమైంది. కూన రవి తీరును గమనిస్తున్న అచ్చెన్న అండ్ కో కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. రాకపోతే నష్టమేంటన్నట్టుగా తేలికగా తీసుకుని వదిలేస్తున్నారు.

సామాజిక వర్గాల పోరుగా మారిన పదవుల పోరు

రాష్ట్రంలో మిగతా జిల్లాల్లో వెలమ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇచ్చే చాన్స్ ఉందని, కాళింగులకు ఇక్కడ తప్ప మరో జిల్లా లేదని, తప్పనిసరిగా తమకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని కాళింగులు మొదటి నుంచి డిమాండ్ చేస్తూ వస్తున్నారు. కానీ ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 10లక్షల జనాభా ఉన్న తమకు మంత్రి వర్గంలో చోటు కల్పించలేదని తీవ్ర ఆగ్రహావేశాలతో ఉన్నారు. కాళింగ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వలేదు సరికదా జిల్లాలో మరో సామాజిక వర్గానికి చెందిన అందులోనూ ఒకే కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర మంత్రి పదవుల్ని చంద్రబాబు కట్టబెట్టడాన్ని మరింత తట్టుకోలేకపోయారు. ఇది ముమ్మాటికీ కాళింగులను, ముఖ్యంగా కూన రవికుమార్ తొక్కి వేయడానికి పన్నిన కుట్ర అని వారంతా బలంగా నమ్ముతున్నారు. ఇప్పటికే ప్రెస్‌మీట్లు, సమావేశాలు పెట్టి నిరసన తెలియజేశారు. కానీ అధిష్టానం నుంచి ఎలాంటి స్పందన లేదు. మంత్రి పదవి కాదు కదా స్పీకర్, డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్, విప్ పదవుల్ని కూడా ఇవ్వలేదు. ఇప్పుడేదో టీటీడీ పదవి వస్తుందని భావిస్తున్నారు. అది కూడా రాకపోతే కాళింగులను పూర్తిగా పక్కన పెట్టేసినట్టే అన్న అభిప్రాయంతో ఉన్నారు. చివరికీ పదవుల వ్యవహారం కాళింగ సామాజిక వర్గానికి, అచ్చెన్నాయుడు సామాజిక వర్గానికి మధ్య గ్యాప్ పెంచింది.

బదిలీ రాజకీయం



కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లా అధికారులు, పోలీసు అధికారుల బదిలీలపై ముఖ్యంగా టీడీపీ ప్రజాప్రతినిధులు గురిపెట్టారు. తమకు కావాల్సిన వారిని రప్పించుకోవాలని ప్లాన్ చేసుకున్నారు. కానీ, వారి ఆలోచనలకు భిన్నంగా బదిలీలు జరిగినట్టు సమాచారం. ఎమ్మెల్యేల సిఫార్సుల కంటే రాష్ట్ర, కేంద్రమంత్రి సిఫార్సులు, ఆప్షన్ల మేరకే బది లీలు జరిగినట్టు టీడీపీలో చర్చ నడుస్తోంది. కూన రవికుమార్‌కు అదే రకమైన పరిస్థితి ఎదురైనట్టు తెలిసింది. బదిలీల విషయంలో కూడా అచ్చెన్నతో కూనకు అభిప్రాయబేధాలు వచ్చినట్టు తెలుస్తోంది.

తేల్చుకోలేకపోతున్న తమ్ముళ్లు



అటు కూన రవి, ఇటు అచ్చెన్నాయుడు మధ్య నడుస్తున్న పదవుల పోరులో తెలుగు తమ్ముళ్లు నలిగిపోతున్నారు. అచ్చెన్న కార్యక్రమాలకు మనోళ్లు వెళ్లనక్కర్లేదని నేరుగా తన కేడర్‌కు, కాళింగ సామాజిక వర్గీయులకు కూన రవి చెప్పేసినట్టు సమాచారం. అచ్చెన్న సామాజిక వర్గానికి మాత్రం ఆంక్షలు పెట్టలేదని తెలుస్తోంది. దీంతో కూన రవిని నమ్ముకుని ఉన్న కేడర్‌తో పాటు కాళింగ సామాజిక వర్గీయులు తమ పనుల కోసం ముందుకు వెళ్లలేక, వెనక్కి తగ్గలేక సతమతమవుతున్నారు. ఒకరిద్దరు సాహసించి వెళ్లగా వారికి సొంత సామాజిక వర్గం నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత ఎదురైంది. అచ్చెన్న వైపు వెళ్లిన వారిపై వాట్సాప్ గ్రూప్‌లో ఒక రేంజ్‌లో కాళింగ సామాజిక వర్గీయులు ఆడేసుకుంటున్నారు. ఇప్పుడిది టీడీపీలోనే కాదు రెండు సామాజిక వర్గాల మధ్య పెద్ద సమస్యగా మారింది.

● ఉరిమే ఉత్సాహం..



రాఖీ పర్వదినం సందర్భంగా స్థానిక ఆదిఆంధ్రావీధిలో సోమవారం నిర్వహించిన గుమ్మా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్థానికంగా యువకులంతా ఈ పోటీల్లో పాల్గొని పురాతన కాలం నుంచి వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగించారు. – టెక్కలి

● ప్రియాతి ప్రియమైన వృక్షానికి..



వృక్షో రక్షతి రక్షితః అనే సందేశానికి ప్రతీకగా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ చినబడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు చెట్టుకు రాఖీ కట్టారు. ఈ వృక్షా బంధన్ మొక్కల సంరక్షణకు ఊతమివ్వాలని ఆకాంక్షించారు. – కాశీబుగ్గ

● సోదర బంధానికి..



ఎస్పీ గ్రీవెన్స్‌సెల్ సందర్భంగా సోమవారం ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డికి రాఖీ కట్టారు. అంతా సోదరభావంతో మెలగాలని కోరారు. – శ్రీకాకుళం క్రైమ్

దారి కాచి.. దాడి చేసి

- ఫరీదుపేటలో వైఎస్సార్ సీపీ కార్యకర్తపై హత్యాయత్నం
- పల్సర్ బైక్ ధ్వంసం
- గ్రామంలో పికెట్ ఉండగా దారుణం




తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ప్రసాద్

సాక్షి టాస్క్‌ఫోర్స్: పచ్చటి పల్లెలో రాజకీయ చిచ్చు రేగుతోంది. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి ఎక్కడో ఒక చోట విపక్ష కార్యకర్తలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట గ్రామంలో ఆదివారం రాత్రి 11.15 గంటల సమయంలో కూన ప్రసాద్ అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ మూకలు దాడికి తెగబడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

స్థానిక ఉపసర్పంచ్ భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు సత్తారు గోపి వద్ద కూన ప్రసాద్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. టీడీపీ వర్గానికి చెందిన కొందరు ఆదివారం రాత్రి జాతీయ రహదారి పక్క ఉన్న దాబా హోటల్‌లో బర్త్‌డే పార్టీ చేసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి బైక్‌లపై గ్రామానికి బయల్దేరారు. అదే సమయంలో కూన ప్రసాద్ తన బండిపై రామ చెరువు వైపు బహిర్భూమికి వెళ్తూ.. వారికి ఎదురుపడడంతో వారంతా ఒక్కసారిగా బైక్ ఆపి తాళం తీసుకుని మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. పది మంది కర్రలతో విచక్షణారహితంగా కొట్టడంతో ప్రసాద్ భయంతో పరుగులు తీశాడు. అయినా వదలకుండా వెంటాడి మరీ కొట్టారు. చివరకు బీసీ కాలనీలోని సూర కృష్ణమూర్తి అనే వ్యక్తి ఇంటి టెర్రస్ పైకి ఎక్కితే.. అక్కడకూ వచ్చి దాడి చేశారు. ఆ దెబ్బలకు తాళలేక అపస్మారక స్థితికి చేరటంతో విడిచి పెట్టి వెళ్లిపోయారు. అనంతరం గ్రామంలో పికెట్ నిర్వహిస్తున్న పోలీసులకు విషయం తెలియడంతో వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ ఆధ్వర్యంలోని సిబ్బంది అక్కడకు వచ్చారు. అనంతరం 108 వాహనంలో క్షతగాత్రుని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో అత్యవసర చికిత్స నిర్వహించి విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ సంఘటనతో గ్రామంలో పోలీస్ పికెట్ బందోబస్తు సిబ్బంది సంఖ్య పెంచారు.

పోలీస్ పికెట్ ఉన్నా..

గ్రామంలో 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్ పికెట్ పెట్టారు. మళ్లీ ఎస్ఎంసీ ఎన్నికలు రావడంతో ఈనెల 8 నుంచి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో పోలీసులు ఉన్న సమయాన కూడా టీడీపీ మూకలు రెచ్చిపోయి దాడులకు పాల్పడడం చర్చనీయాంశమవుతోంది. టీడీపీ వర్గానికి చెందిన తమ్మినేని అన్నాజీరావు, కూన శ్రీనివాసరావు, కొత్తకోట ఈశ్వరరావు, సీపాన శివకుమార్, గురుగుబెల్లి మురళీకృష్ణ, కొత్తకోట అప్పన్న, కొత్తకోట సూర్యనారాయణ, కొత్తకోట కృష్ణారావు, పైడిపెద్ది వేణు, కొత్తకోట రాజా, కొత్తకోట అనిల్‌తో పాటు మరికొందరు దాడికి పాల్పడినట్లు బాధితుడితో పాటు ఆయన తండ్రి కూన వెంకటరావు పోలీసు ఫిర్యాదులో పేర్కొన్నారు. కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మరికొందరు పరారీలో ఉన్నారు. జేఆర్‌పురం సీఐ అవతారం, ఎచ్చెర్ల ఎస్ఐ చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు. హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ కేజీహెచ్‌కు వెళ్లి ప్రసాద్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.



బైక్ పరిశీలిస్తున్న ఎస్ఐ చిరంజీవి, పోలీసులు



దాడులు దారుణం

ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదు. ఇలాంటి దాడులు జరగటం దురదృష్టకరం. పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలి. దోషులను కఠినంగా శిక్షించాలి. గ్రామాల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.

– గొర్లె కిరణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

23 నుంచి అన్ని పంచాయతీల్లో ఉపాధి గ్రామ సభలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని ఉపాధి జాబ్ కార్డుదారులందరికీ పని దినాలను కల్పించేందుకు అవసరమైన పనులను గుర్తించేందుకుగాను ప్రతి పంచాయతీలోనూ ఈ నెల 23వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ చిట్టిరాజు సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన మెటీరియల్ పనులను కూడా ఈ గ్రామ సభలోనే ఆమోదించాలని ఆయన సూచించారు. సోమవారం సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సభల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తోందని, జిల్లాలో ప్రతిష్టాత్మకంగా గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. ఎంపీడీఓల ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ, ఈఓపీఆర్డీ, ఉపాధి హామీ పథకం సిబ్బంది ఈ గ్రామ సభల్లో విధిగా పాల్గొనాలని పేర్కొన్నారు.

21 నుంచి ఎస్ఎస్ఆర్ 2025 కోసం సర్వే



మాట్లాడుతున్న డీఆర్ఓ అప్పారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ప్రత్యేక సమ్మరీ రివిజన్–2025 షెడ్యూల్ సర్వేలు బుధవారం నుంచి ఇంటింటా నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన తన చాంబర్‌లో సోమవారం మాట్లాడారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి ఉపాధ్యాయ ఓటర్ల నమోదు కోసం సెప్టెంబర్ 30వ తేదీన షెడ్యూల్‌ను విడుదల చేస్తామని చెప్పారు. అలాగే 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా బుధవారం నుంచి జరిగే ఇంటింటి సర్వేలో బూత్ లెవెల్ ఆఫీసర్లు వారికి అవగాహన కల్పిస్తారన్నారు. సాధారణ కొత్త ఓటర్ల నమోదుకు, బదిలీకి, చిరునామా మార్పునకు, ఫొటో మార్చుకునేందుకు ఇప్పుడు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పీఎంజే బాబు (టీడీపీ), రౌతు శంకరరావు (వైఎస్సార్ సీపీ), లాస సోమేశ్వరరావు (బీఎస్పీ), రట్టి ప్రకాశ రావు (సీపీఎం) పాల్గొన్నారు.

మరో ఐదు రోజులకే..



కొత్తూరు: అంగూరు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఐదు రోజులకు సరిపడా సుమారు వంద మెట్రిక్ టన్నుల ఇసుక ఉన్నట్లు రెవెన్యూ అధికారులు చెప్పారు. ఇక్కడ సుమారు 10 వేల మెట్రిక్ టన్నులు ఇసుక స్టాక్ చేశారు. సుమారు 40 రోజుల నుంచి ఇసుక అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ స్టాక్ పాయింట్ నుంచి ఎక్కువగా పాతపట్నం, మెళియాపుట్టి, సీతంపేట మండలాలకు చెందిన వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. ఇసుక అయిపోతే ఆయా మండలాలకు కొరత తప్పదు.

క్లుప్తంగా

ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ బెస్ట్ క్యాడెట్‌గా స్వీకృతి



స్వీకృతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్ర, పోలినాయుడు, హరిత

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ డి.స్వీకృతి చరిత్ర లిఖించింది. కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న యువ ఉమెన్ క్యాడెట్ విశాఖపట్నం ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్ తరఫున బెస్ట్ క్యాడెట్‌గా గుర్తింపు పొందింది. ఇటీవలి గ్రూప్ కమాండర్ నిర్వహించిన పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఆర్‌డీసీ బెస్ట్ క్యాడెట్ పోటీలు జరిగే అనంతపురం ఎన్‌సీసీ క్యాంప్‌నకు ఎంపికై శభాష్ అనిపించింది. కళాశాల నుంచి ఈ ఫీట్ సాధించిన మొదటి మహిళా ఎన్‌సీసీ క్యాడెట్‌గా స్వీకృతి గుర్తింపు అందుకుంది. స్వీకృతిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు సోమవారం కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ వై.పోలినాయుడు, మహిళా కేర్ టేకర్‌లు పావని, వరలక్ష్మి, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రోణంకి హరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొంటే కూర'గాయాలే'



బూర్జ: కూరగాయల ధరలు కొండెక్కాయి. ధరలు అనూహ్యంగా పెరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. రూ.500 తీసుకెళ్లినా చేతి సంచి నిండేంత కూరగాయలు రావడం లేదని వాపోతున్నారు. టమాటా కిలో రూ. 50-60, ఉల్లి కిలో రూ. 40-50, పచ్చిమిర్చి కిలో రూ.100-120, బంగాళా దుంపలు కిలో రూ. 40-50, వంగ కిలో రూ. 50, బెండ కిలో ధర రూ. 40 వరకు పలుకుతున్నాయి. అలాగే దొండ కిలో రూ. 50, బీర రూ. 60, క్యారట్ రూ. 100, కాకర రూ. 60, గోరు చిక్కుడు రూ. 60, క్యాప్సికమ్ 100, బీన్స్ 100 పలుకుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఇలా ధరలు అనూహ్యంగా పెరుగుతుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

ఎచ్చెర్ల: వైన్ షాపుల్లో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎచ్చెర్లలో ఉన్న ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ డీఎం సుబ్బారావుకు వైన్‌షాపుల సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు కలిసి సోమవారం వినతిపత్రం అందించారు. నూతన మద్యం పాలసీ తీసుకువస్తారని అంటున్నారని, అలా జరిగితే తామంతా ఉద్యోగాలు కోల్పోతామని, తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. అందరికీ 30 ఏళ్ల వయస్సు దాటిపోవడం వల్ల ప్రైవేటు కంపెనీలకు కూడా అర్హత లేకుండా పోయిందని అన్నారు. తమకు వేరే అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో ఎక్కడైనా ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. వారిలో ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ సేల్స్‌మేన్, సూపర్‌వైజర్లు కె.గోవిందరావు, సంతోష్, ఎ.హరిరెడ్డి, కె.రమణమూర్తి, జి.సురేష్‌కుమార్, జి.శ్రీనుబాబు తదితరులు ఉన్నారు.

ముగిసిన పోరు



బాలుర విభాగంలో చాంపియన్‌గా నిలిచిన విజయనగరం క్రీడాకారులకు ట్రోఫీ, మెడల్స్ అందజేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులు



బాలికల విభాగంలో చాంపియన్‌గా నిలిచిన విజయనగరం క్రీడాకారిణులతో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు, కలిదిండి తదితరులు

- సాఫ్ట్‌బాల్ స్టేట్‌మీట్ బాలురు, బాలికల విభాగాల్లో చాంపియన్‌గా నిలిచిన విజయనగరం
- ఆతిథ్య శ్రీకాకుళంకు బాలురులో రన్నరప్, బాలికల్లో తృతీయ స్థానం
- ప్రభుత్వం నుంచి రూపాయి సాయం లేకపోయినా పోటీల నిర్వహణ

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం వేదికగా మూడు రోజులపాటు కన్నులపండువలా సాగిన సాఫ్ట్‌బాల్ స్టేట్‌మీట్ ఘనంగా ముగిసింది. బాలబాలికలు రెండు విభాగాల్లోను విజయనగరం జట్లు చాంపియన్‌గా నిలవగా, ఆతిథ్య శ్రీకాకుళం జట్లు సైతం మెరిశాయి. బాలురు విభాగంలో రన్నరప్‌గా, బాలికల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే బాలికల విభాగంలో గుంటూరు రన్నరప్‌గా నిలవగా, బాలురులో అనంతపురం తృతీయ స్థానం, గుంటూరు నాల్గో స్థానాలతో సరిపెట్టుకున్నాయి. శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానం వేదికగా నిర్వహించిన 11వ ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్-2024 పోటీలకు ఉమ్మడి 13 జిల్లాల బాలబాలికల జట్లు హాజరయ్యాయి. సాఫ్ట్‌బాల్ సంఘ జిల్లా అధ్యక్షులు కలిదిండి నరసింహరాజు నేతృత్వంలో నిర్వాహకులు మెరుగైన ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం నుంచి రూపాయి సాయం లేనప్పటికీ మంచి ఆతిథ్యాన్ని అందించి.. పోటీలకు హాజరైన వివిధ జిల్లాల క్రీడాకారులు, కోచ్ మేనేజర్లు, టెక్నికల్ సిబ్బంది మన్ననలు అందుకున్నారు.

క్రీడలతోనే ఆరోగ్యవంతమైన సమాజం: కేంద్ర మంత్రి

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కేవలం క్రీడలు, వ్యాయామంతోనే సాధ్యపడుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర సాఫ్ట్‌బాల్ స్టేట్‌మీట్ ముగింపు, బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. కేఆర్ స్టేడియంకు అత్యుత్తమ ప్రమాణాలతో పనులను చేపడుతున్నామని, 7 గేట్లు పెట్టి నిర్మాణం చేస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి నరసింహరెడ్డి, జిల్లా కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, జిల్లా చైర్మన్ బడగల హరిధరరావు, ఒలింపిక్ సంఘ జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, పి.సుందరరావు, ఎన్‌జీఓ సంఘ నాయకుడు హనుమంతు సాయిరాం, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, డీఎస్‌డీఓ కె.శ్రీధర్‌రావు, డీవైఈఓ ఆర్.విజయకుమారి, సబ్‌రిజిస్ట్రార్ గురుగుబెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు

బాలురు విభాగంలో: విజయనగరం విజేతగా, శ్రీకాకుళం రన్నరప్‌గా, అనంతపురం, గుంటూరు జిల్లాలు మూడు నాలుగు స్థానాల్లో నిలిచాయి.

బాలికల విభాగంలో: విజేతగా విజయనగరం, రన్నరప్‌గా గుంటూరు, మూడో స్థానంలో శ్రీకాకుళం, నాల్గో స్థానంలో కృష్ణా నిలిచింది.


ఇంతటి ఆదరణ ఎక్కడా లేదు..



నేను జపాన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ టోర్నీలో ఇండియాకు ప్రాతినిధ్యం వహించాను. 40కిపైగా నేషనల్స్ ఆడాను. స్టేట్‌మీట్స్ లెక్కలేదు. చాలా ప్రాంతాలకు వెళ్లాం. ఆడాము. కానీ ఇంతటి ఆదరణ ఎక్కడా లభించదు. శ్రీకాకుళం వస్తే మమ్మల్ని బాగా చూసుకుంటారు.

– బి.రాంబాబు, కోచ్, గుంటూరు జిల్లా

శ్రీకాకుళం వస్తే మాకు పండగే..



శ్రీకాకుళంలో జరిగే స్టేట్ మీట్స్‌కు రావడమంటే మాకు పెద్ద పండగే. నేను ఇక్కడకు రావడం ఐదో సారి. గత నాలుగుసార్లు కంటే ఈసారి చాలా గొప్పగా ఏర్పాట్లు చేశారు.

– మనవ బద్రీనారాయణ, టెక్నికల్ అఫీషియల్స్ ఇన్‌చార్జి, ఏపీ

ఆడ పిల్లలను బాగా చూసుకున్నారు..



మాది గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం పల్లపాడు గ్రామం. ఇక్కడ వసతి, భోజనాలు సూపర్. ఆడపిల్లలను తమ సొంతపిల్లల మాదిరిగా చాలా బాగా చూసుకున్నారు.

– సీహెచ్ అనిత, నేషనల్ ప్లేయర్, గుంటూరు జిల్లా

అమ్మవారి ఆలయంలో చోరీ



దొంగిలించిన సీసీ కెమెరాల సీపీయూ

సారవకోట: మండలంలోని బుడితి పెల్లేటి చెరువు గట్టుపై ఉన్న విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు ఆలయ తాళాలు పగలగొట్టి ఆలయంలోకి ప్రవేశించి హుండీలోని నగదు కాజేశారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సీపీయూను తీసుకెళ్లారు. దీనిపై స్థానికులు సారవకోట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇక్కడ దొంగతనం జరగడం ఇది మూడోసారి కావడం విశేషం. ఇన్నిసార్లు చోరీలు జరగడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్క గ్రామమైన చీడిపూడి రైస్ మిల్లులో దొంగలు పడి రూ.1.30 లక్షలు దోచుకుని పోయారు. అదేరోజు బుడితి గ్రామంలోని అయ్యప్ప స్వామి, షిర్డీ సాయి దేవాలయాల్లో దొంగలు జొరబడి సీసీ కెమెరాలు నాశనం చేసి హుండీలు తీసుకెళ్లి బయట పడేశారు. అలాగే బోర సిమ్మయ్య, పంచిరెడ్డి నారాయణరావు ఇంట్లో దొంగలు పడి బంగారం, వెండి నగలు, ఇంట్లో ఉన్న సామాన్లు తీసుకెళ్లిపోయారు. ఆ కేసుల్లో ఇంతవరకు ఎవరినీ పట్టుకోలేదు.

వాణిజ్య పన్నుల శాఖ జేసీపై దళిత సంఘాల ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అలికాన రాజేశ్వరిని వేధింపులకు గురి చేస్తున్న ఆ శాఖ విజయనగరం జాయింట్ కమిషనర్ బుడుమూరు నాగార్జున రావుపై ఎస్పీ గ్రీవెన్స్‌లో సోమవారం దళిత సంఘాల ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘ కన్వీనరు, శ్రీకాకుళం దళిత పౌరుల సంరక్షణ సమితి గౌరవాధ్యక్షులు, నూతులపాటి భరత్ భూషణ్‌రాజ్ మాట్లాడుతూ ఒంటరి దళిత మహిళ రాజేశ్వరి పట్ల నాగార్జునరావు చర్యలపై ఇప్పటికే రెండో పట్టణ పీఎస్‌లోను, గతంలో ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, ఈ విషయమై ఇప్పటికే జాతీయ ఎస్సీ, ఎస్టీ కమీషన్ (ఢిల్లీలో), జాతీయ మహిళా కమిషన్, ఏపీ మానవహక్కుల కమీషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఎస్పీని కలిసినవారిలో దళిత సంఘాల ప్రతినిధులు పోతల దుర్గారావు, డేనియల్, శ్యామసుందరరావు, గంజి ఎజ్రా ఉన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- సైనిక్ స్కూల్స్ ఇంటర్ గ్రూప్ స్పోర్ట్స్ అండర్ కల్చరల్ మీట్ ప్రారంభం



సైనిక్ స్కూల్ ఇంటర్ గ్రూప్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

విజయనగరం: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ నేషనల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌లో పాల్గొనబోయే గ్రూప్-ఎఫ్ జోన్‌కు సంబంధిచిన ఇంటర్ గ్రూప్ పోటీలు విజయనగరం మండలంలోని కోరుకొండ సైనిక్ స్కూల్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. పోటీల్లో ఆతిథ్య కోరుకొండ సైనిక్ స్కూల్ విద్యార్థులతో పాటు అంబికాపూర్, భువనేశ్వర్, సంబల్‌పూర్ సైనిక్ స్కూల్‌కు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీలను కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి ప్రారంభించగా... వివిధ స్కూల్స్ నుంచి వచ్చిన విద్యార్థుల నుంచి క్రీడా వందనాన్ని స్వీకరించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. పరుగు, వాలీబాల్, బాస్కెట్‌బాల్ తదితర క్రీడాంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచేందుకు క్రీడాకారులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందించేందుకు క్రీడలు దోహద పడతాయని పేర్కొన్నారు. విద్యార్థి స్థాయిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేందుకు క్రీడలు చక్కని వేదికగా నిలుస్తాయని, ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో తలపడి తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్/వింగ్ కమాండర్ వి.కిరణ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/ లెఫ్టినెంట్ కమాండర్ అభిలాష్ బాలచంద్రన్‌తో పాటు పాఠశాలల సిబ్బంది, క్యాడెట్‌లు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాల్సిందే



బస్టాండ్ కూడలిలో కోల్‌కతా ఘటనపై నిరసన తెలియజేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్యచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని స్థానిక స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలల విద్యార్థులు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు అన్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్ గుండా రోటరీ క్లబ్, జేసీఐ, శాంతినికేతన్ పాఠశాల, సత్యసాయి పాఠశాలల విద్యార్థులు సోమవారం ర్యాలీ చేసి బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించారు. మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. –ఇచ్ఛాపురం

భారీ కొండచిలువ హతం

కాశీబుగ్గ: పలాస మండలం తర్లాకోట పంచాయతీ గట్టూరు గ్రామం పరిధిలో సోమవారం సాయంత్రం కొండచిలువ హల్‌చల్ చేసింది. మేకలు, గేదెలు కొండ వైపు మేతలు వేస్తుండగా ఒక్కసారిగా అలజడి సృష్టించడంతో ప్రాణభయంతో స్థానికులు కొండ చిలువను హతమార్చారు. సుమారు ఇరవై అడుగులు ఉండవచ్చునని మేకపిల్లలను మింగడానికి ప్రయత్నించిదని వారు తెలిపారు.



ఆదిత్యుని సన్నిధిలో కమ్యూనికేషన్స్ డీఐజీ



ఆదిత్యుని జ్ఞాపికను డీఐజీ లక్ష్మికి అందజేస్తున్న శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామిని (మంగళగిరి) కమ్యూనికేషన్స్ డీఐజీ ఎస్ఎస్‌జి లక్ష్మి కుటుంబ సమేతంగా సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ప్రొటోకాల్ ప్రకారం వారికి ఆలయ సంప్రదాయ ప్రకారం ప్రత్యేక స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వారి గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ విశిష్టతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది బీఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



వాహనం ఢీకొనడంతో మృతి చెందిన వ్యక్తి

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడు పంచాయతీ వెంకంపేట గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసు తెలిపిన వివరాలు ప్రకారం .. వెంకంపేట బస్ షెల్టర్‌లో చాలా కాలంగా ఓ వ్యక్తి ఉంటున్నాడు. ఆయన తెల్లవారు జామున వెంకంపేట బస్ షెల్టర్ నుంచి బొంతు వైపు నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఇదే మార్గంలో రన్నింగ్ చేయడానికి వచ్చిన యువకులు గాయాలతో పడి ఉన్న వ్యక్తిని చూసి 108 వాహనానికి ఫోన్ చేశారు. 108 వాహనంలో శ్రీకాకుళం ఆస్పత్రికి తరలిస్తుండగా ఆయన దారిలో మృతి చెందినట్లు ఎస్‌ఐ అప్పారావు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు తెలియరాలేదని, ఫొటోను గుర్తించి ఎవరైనా బంధువులు, తెలిసిన వారు ఉంటే సారవకోట పోలీసుస్టేషన్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

హైకోర్టులో దువ్వాడ శ్రీనివాస్ పిటిషన్

సాక్షి, అమరావతి: తానిచ్చిన ఫిర్యాదు ఆధారంగా తన భార్య వాణి, పెద్ద కుమార్తె హైందవిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ హైకోర్టును ఆశ్రయించారు. తన ఫిర్యాదు ఆధారంగా చర్యలు తీసుకోని టెక్కలి సీఐ, ఎస్ఐలపై విచారణ జరిపి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునేలా ఎస్పీకి ఆదేశాలు ఇవ్వాలని ఆయన తన వ్యాజ్యంలో కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై సోమవారం న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి విచారణ జరిపారు. దువ్వాడ తరఫు న్యాయవాది టీఎంకే చైతన్య వాదనలు వినిపిస్తూ, ఫిర్యాదు చేసినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దర్యాప్తు కూడా చేయడం లేదన్నారు. పోలీసులు ఉద్దేశపూర్వకంగానే ఇలా చేస్తున్నారని తెలిపారు. హోంశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ, పిటిషనర్ ఫిర్యాదు చేసిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగిందన్నారు. దువ్వాడ శ్రీనివాస్ భార్య వాణి, పెద్ద కుమార్తె హైందవికి సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ నోటీసులు ఇచ్చామన్నారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఏం చేయలేదనడం ఎంత మాత్రం సరికాదని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి పూర్తి వివరాలతో 3 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారు. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు.

నూతన విద్యార్థుల సందడి



కుటుంబంతో వస్తున్న విద్యార్థిని



ఎస్ఎంపురం క్యాంపస్‌లో విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్ఎంపురం క్యాంపస్‌లో నూతన విద్యార్థులు సందడి చేస్తున్నారు. రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తి కాగా, ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) మొదటి ఏడాది విద్యార్థులు షెడ్యూల్ మేరకు సోమ, మంగళవారాల్లో సెల్ఫ్ రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు కుటుంబ సభ్యులతో వచ్చి చేరుతున్నారు. బాలికలకు ఎస్ఎంపురం క్యాంపస్, బాలురుకు చిలకపాలేంలోని శ్రీ శివానీ అద్దెక్యాంపస్‌ల్లో వసతి కల్పిస్తున్నారు. ఈ నెల 21 నుంచి క్లాస్‌వర్క్ ప్రారంభం కానుంది. జనరల్ కేటగిరీలో 1035 సీట్లకు రెండు విడతల కౌన్సెలింగ్‌లో 986 ప్రవేశాలు జరిగాయి. ప్రత్యేక కేటగిరీ సీట్లు 75 ఇంకా ప్రకటించాల్సి ఉంది. అనంతరం మిగిలి ఉన్న 49 సీట్లకు మూడో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేయనున్నారు. షెడ్యూల్ మేరకు విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని, క్లాస్‌వర్క్ ఈ నెల 21నుంచి ప్రారంభించనున్నట్లు డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు.

ఆటోలో బ్యాటరీ చోరీ

టెక్కలి రూరల్ : స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద గల మెకానిక్ షాపు వద్ద ఉంచిన టాటామ్యాజిక్ ఆటోలో బ్యాటరీ చోరీకి గురైనట్లు ఆటో యజమాని పి.చిన్నారావు తెలిపారు. పూండికి చెందిన చిన్నారావు తన ఆటోను మరమ్మతుల కోసం టెక్కలి తీసుకువచ్చారు. రెండు రోజులుగా ఆటోను వర్క్ షాపులోనే ఉంచి సోమవారం వచ్చి చూసే సరికి తన ఆటోలో బ్యాటరీ లేదని గుర్తించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైక్ దొంగల అరెస్టు

ఆమదాలవలస:

ఆమదాలవలస శివారు పార్వతీశ్వరుని పేట జంక్షన్ వద్ద సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో నలుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు సీఐ దివాకర్ నాయుడు తెలిపారు. వీరు బైక్‌లను దొంగిలిస్తున్నట్లు తేలిందన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం రూరల్ మండలం కాజీపేట, పెద్ద గనగళ్లవానిపేట గ్రామానికి చెందిన యారుపల్లి అశోక్, కల్లేపల్లి పంచాయతీ జాలారిపేటకు చెందిన సవడల గురునాథ్‌లతో పాటు మరో ఇద్దరు మైనర్లను పట్టుకున్నామని తెలిపారు. వారి వద్ద ఉన్న వాహనాలు వారివి కాదని తేలిన తర్వాత దర్యాప్తు చేయగా వారు ఈ మూడు వాహనాలతో పాటు మరో ఆరు వాహనాలను కూడా దొంగిలించినట్లు ఒప్పుకున్నారని చెప్పారు. ఆ ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ వాహనాలను వారు ఇక్కడ దొంగిలించి ఒడిశా రాష్ట్రంలో పలు చోట్ల విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు. సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి ద్విచక్ర వాహన చోరులను పట్టుకున్నందుకు వారిని సీఐ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్ఐ కె.వెంకటేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను చూపిస్తున్న పోలీసులు

ఆక్రమిత స్థలాల స్వాధీనానికి ఆదేశం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి పెద్దకొండ దిగువ ప్రాంతంలోని 280,117-1 సర్వే నంబర్‌లలో సుమారు 2 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ లే-అవుట్‌లు వేసినట్లు తన దృష్టికి వచ్చిందని, ఆ స్థలంపై సమగ్ర విచారణ జరిపి స్వాధీనం చేసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీచేసినట్లు కోటబొమ్మాళి తహసీల్దార్ ఆర్.అప్పలరాజు సోమవారం తెలిపారు. ఆ మేరకు మంగళవారం నుంచి 280,117-1 సర్వేనంబర్‌లలో పూర్తి స్థాయి సర్వే నిర్వహించి ఆక్రమిత స్థలాలను స్వాధీనం చేసుకుని, ఆ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.